సాక్షి అనంతపురం

శుక్రవారం । 14 । జూన్ । 2024



టన్ను చీనీ రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు పలికాయి.



రక్తదాత సుఖీభవ

అత్యవసర సమయంలో ఓ వ్యక్తికి రక్తం అందించడంలో కన్నా మరో గొప్ప దానం లేదు.

8లో

గరిష్టం/కనిష్టం

32.2°/ 23.4°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

శాంతిభద్రతల సమస్య తలెత్తనీయొద్దు



పోలీసులతో సమీక్షిస్తున్న ఎస్పీ గౌతమి శాలి

ఉరవకొండ: గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ గౌతమి శాలి ఆదేశించారు. గురువారం ఉరవకొండ రూరల్ సర్కిల్ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలు, కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాలను తరుచూ సందర్శించడమే కాకుండా నిరంతరం మొబైల్ పార్టీలతో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. అవసరమనుకుంటే పికెట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా అల్లర్లు, విధ్వంసాలు, దాడులకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రశాంతత లోపించకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, సీఐ సురేష్‌బాబు, ఎస్‌ఐ రాఘవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

అన్ని వేళలా అప్రమత్తంగా ఉండండి

తాడిపత్రి అర్బన్: పోలీస్ అధికారులు, సిబ్బంది అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గౌతమి శాలి సూచించారు. గురువారం సాయంత్రం తాడిపత్రి అర్బన్, రూరల్ పోలీసుస్టేషన్లను ఆమె తనిఖీ చేశారు. పోలింగ్, ఆ మరుసటి రోజు జరిగిన అల్లర్లకు సంబంధించిన కేసుల గురించి ఆరా తీశారు. ఇప్పటి వరకు ఎంత మందిని అదుపులోకి తీసుకుని విచారించారు, ఎంత మందిని అరెస్టు చేశారు, సాక్షులు ఎంత మందిని విచారించారు తదితర విషయాలపై డీఎస్పీ జనార్దన్‌నాయుడును అడిగి తెలుసుకున్నారు. ఎంత మందిపై రౌడీ షీట్లు, బైండోవర్ చేశారని ప్రశ్నించారు. పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెటింగ్‌ను కొనసాగిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ బీట్ల విషయంలో జాగ్రత్త పడాలన్నారు. అనంతరం రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ పికెటింగ్, చెక్‌పోస్టులపై సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డిని ఆరా తీశారు.

9 వేల ఎకరాల్లో డ్రైల్యాండ్ హార్టికల్చర్

అనంతపురం టౌన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 9 వేల ఎకరాల్లో డ్రైల్యాండ్ హార్టికల్చర్‌ను అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. 5 ఎకరాల్లోపు మెట్ట భూములున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే పండ్ల మొక్కల సాగుకు దరఖాస్తు చేసుకున్న రైతులకు సంబంధించి 1,200 ఎకరాల మేర అంచనాలు పూర్తి చేసి పనులను ప్రారంభించినట్లు వెల్లడించారు. పండ్ల మొక్కల సాగుపై ఆసక్తి ఉన్న రైతులు మండల కేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది మామిడి, చీనీ, అంజూర, జామ, నిమ్మ, అల్లనేరుడు, సపోటతోపాటు డ్రాగన్ ఫ్రూట్‌ను సైతం పథకంలోకి చేర్చినట్లు తెలిపారు. ఎకరాలోపు అంతర్గత పంటలుగా పూల మొక్కలు, మునగ పంటలను సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీసీసీబీ సీఈఓగా సురేఖారాణి



సీఈఓగా బాధ్యతలు చేపట్టిన కె.సురేఖారాణి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ముఖ్య కార్య నిర్వహణాధికారి (సీఈఓ)గా కె.సురేఖారాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం సీఈఓగా ఉన్న ఏబీ రామ్‌ప్రసాద్ వ్యక్తిగత కారణాలతో స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. గత నెల 29న ఆయన సమర్పించిన రాజీనామా పత్రాన్ని ఎట్టకేలకు డీసీసీబీ పాలకవర్గం, రాష్ట్ర సహకార బ్యాంకు (ఆప్కాబ్) ఆమోదం తెలిపారు. ఈ క్రమంలోనే ఇక్కడే జనరల్ మేనేజర్ (జీఎం)గా ఉన్న కె.సురేఖారాణికి సీఈఓ (ఎఫ్‌ఏసీ) బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా స్థానిక డీసీసీబీలో బాధ్యతలు చేపట్టిన కె.సురేఖారాణి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డిపాజిట్లు పెంచాలని, నిర్థరక ఆస్తులు (ఎన్‌పీఏ) తగ్గించాలని, రైతులకు ప్రాధాన్యత ఇస్తూనే మిగతా అన్ని వర్గాలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు, రుణాల పంపిణీలో పారదర్శకత పాటించాలని దిశానిర్దేశం చేశారు. నూతన సీఈఓకు ఆ శాఖ అధికారులు, సిబ్బంది, అసోసియేషన్ నాయకులు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.



బడికి వెళ్తున్న విద్యార్థులు



ప్రార్థన చేస్తూ..



అనంతపురం శారద మున్సిపల్ పాఠశాలలో బడిగంట కొడుతున్న సిబ్బంది

బడి గంటలు మోగిన వేళ

ఆటలు అటకెక్కించారు. సెలవులకు స్వస్తి పలికారు. ఉత్సాహంగా బడి బాట పట్టారు. వేసవి సెలవుల అనంతరం గురువారం జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద పనిచేసే పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఇన్నాళ్లు ఆటపాటలతో గడిపిన విద్యార్థులు బడుల బాట పట్టారు. మొదటి రోజు పాఠశాలల్లో ఉత్సాహంగా గడిపారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

చదువుకొనాల్సిందేనా?

❐ నగరంలోని రాజీనగర్‌కు చెందిన శ్రీధర్ ప్రైవేట్ ఉద్యోగి. నెలకు రూ. 20 వేల జీతం వస్తోంది. ఈయనకు ఇద్దరు పిల్లలు. ఒకరు ఈ ఏడాది 5వ తరగతి, మరొకరు 7వ తరగతికి వెళ్తున్నారు. నగరంలోని పేరు మోసిన ఓ కార్పొరేట్ పాఠశాలలో చేర్పించాలని భావించాడు. ఈ క్రమంలో అడ్మిషన్ కోసం వెళ్లగా యాజమాన్యం చెప్పిన 'లెక్క'లు చూసి శ్రీధర్ అవాక్కయ్యాడు. ఇద్దరు పిల్లలకు అడ్మిషన్, స్కూల్ ఫీజు, యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలు, టై, బెల్ట్, షూ, బస్సు రవాణా కలిపి రూ. లక్షా 20 వేలుకు వచ్చింది. తనకొచ్చే జీతం ఇంటి ఖర్చులకు సరిపోతుంది. పిల్లలకు బంగారు భవిష్యత్తు ఉండాలనే ఆశతో అప్పు చేసి మరీ చదివించేందుకు సిద్ధమయ్యాడు.

❐ రాయదుర్గం మండలానికి రైతు ఈశ్వరయ్య కుమారుడు పదో తరగతి పూర్తి చేసుకున్నాడు. దీంతో ఈ ఏడాది అనంతపురం నగరంలోని ఓ కార్పొరేట్ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం (కో సూపర్ చైనా) చేర్పించేందుకని ఈశ్వరయ్య, ఆయన భార్య వెళ్లారు. 'ఫీజు రూ. 2 లక్షలు. రాయితీ పోనూ రూ. 1.70 లక్షలు. పుస్తకాలు, స్టడీ మెటీరియల్ ఇతరత్రా ఖర్చులు అదనం' అని యాజమాన్యం చెప్పడంతో ఆలోచనలో పడ్డ ఈశ్వరయ్య దంపతులు కుమారుడి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అప్పు చేసైనా చదివించాలని నిర్ణయించుకున్నారు.

- కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజు మాటు దోపిడీ
- వసతుల కల్పనలో అధ్వానం
- ఈనెలలో విద్యార్థుల తల్లిదండ్రులపై మరింత ఆర్థిక భారం
- ఫీజుల నియంత్రణ తమ చేతుల్లో లేదంటూ చేతులెత్తేస్తున్న అధికారులు



అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. కాన్సెప్ట్, ఐఐటీ, టెక్నో, ఈ–టెక్నో, స్మార్ట్, టాలెంట్, ఒలంపియాడ్, సీబీఎస్, కో సూపర్ చైనా, ఎస్–120, కోస్పార్క్, జేఎఫ్‌టీబీ, ఐసీ, ఎస్–40, తదితర ఆకర్షణీయమైన పేర్లతో బోర్డులు పెట్టుకుని దోపిడీ చేస్తున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివించాలంటే సగటు మనిషి ఒళ్లు గుల్ల చేసుకోవల్సిన పరిస్థితి. రకరకాల పేర్లతో వేలాది రూపాయలు దండుకుంటున్నారు. చివరకు బయట మార్కెట్‌లో రూ. 2 వేల నుంచి 3 వేలకు లభించే యూనీఫాం, పుస్తకాలను కార్పొరేట్ విద్యా సంస్థల్లో రూ. 10 వేల నుంచి 12 వేలు వసూలు చేస్తున్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను నిలువుదోపిడీ చేస్తున్నా...అధికారులు చోద్యం చూస్తున్నారు. జూన్ నెల వచ్చిందంటే విద్యార్థుల తల్లిదండ్రులకు టెన్షన్ పట్టుకుంటోంది. పిల్లల ఫీజుల కోసం అదనంగా అప్పులు చేయాల్సి వస్తోందంటూ తల్లిదండ్రులు వాపోతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు

కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలకు పాతరేస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు చేసుకుంటున్నారు. 'పరిమితమైన అడ్మిషన్లు' అంటూ బోర్డులు పెట్టి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఆర్భాటపు ప్రకటనలు నమ్మి తల్లిదండ్రులు ముందుగానే అడ్మిషన్లు చేయించారు. పేరుకే కార్పొరేట్ విద్యా సంస్థలుగానీ అక్కడ వాస్తవ పరిస్థితి చూస్తే వసతులు ఘోరంగా ఉంటున్నాయి. చాలా కార్పొరేట్ పాఠశాలలు ఇరుకు భవనాల్లో నడుపుతున్నారు. వాటికి క్రీడా మైదానాలు కనిపించవు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా మరుగుదొడ్లు ఉండవు. చాలా తక్కువ సంఖ్యలో ఉంటుండడంతో ముఖ్యంగా బాలికల అగచాట్లు దేవుడికెరుక. ఇదిలాఉండగా ఫీజుల నియంత్రణ తమ చేతుల్లో లేదంటూ విద్యాశాఖ అధికారులు చేతులెత్తేస్తున్నారు. గతంలో ఫీజులను నిర్ణయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, దానిపై కార్పొరేట్ విద్యా సంస్థలు కోర్టుకు వెళ్లడంతో స్టే ఇచ్చిందంటూ మిన్నకుండిపోతున్నారు.

ఫీజు దోపిడీని అరికట్టాలి



జిల్లాలో కార్పొరేట్ విద్యా సంస్థలు కాన్సెప్ట్, ఈ టెక్నో, ఈస్మార్ట్, సూపర్ చైనా తదితర కార్పొరేట్ వంటి పేర్లతో ఆర్భాటపు ప్రచారం చేసి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. దీనికితోడు నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారు. వీరి ఫీజు దోపిడీపై అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. అన్ని కార్పొరేట్ పాఠశాలల్లో వారు సొంతంగా తయారు చేసుకున్న పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నా అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు.

–షేక్ బాబా సలామ్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు, అనంతపురం

జిల్లాలో మొత్తం స్కూళ్లు	2,417
ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు	1,183
ప్రాథమికోన్నత పాఠశాలలు	191
ఉన్నత పాఠశాలలు	347
ప్రైవేట్ ప్రాథమిక పాఠశాలలు	217
ప్రైవేట్ ప్రాథమికోన్నత పాఠశాలలు	215
ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు	241
ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు	3,51,459

రెండు రోజులు వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు గురువారం బులెటిన్ విడుదల చేశారు. అక్కడక్కడా 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయవచ్చన్నారు. అలాగే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం నమోదు కావచ్చని తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 29.8 నుంచి 36 డిగ్రీలు, కనిష్టం 22.2 నుంచి 24.7 డిగ్రీలు నమోదవుతాయని, గాలిలో తేమశాతం ఉదయం 68 నుంచి 88, మధ్యాహ్నం 60 నుంచి 74 శాతం మధ్య రికార్డు కావచ్చని పేర్కొన్నారు. నైరుతి దిశగా గంటకు 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు.

కొనసాగుతోన్న వరుణుడి జోరు..

వరుణుడి జోరు జిల్లాలో కొనసాగింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 27 మండలాల పరిధిలో ఏకంగా 16.7 మి.మీ సగటు నమోదైంది. విడపనకల్లు 54 మి.మీ, డి.హీరేహాళ్ 48 మి.మీ, వజ్రకరూరు 42.2, బెళుగుప్ప 40.2, బొమ్మనహాళ్ 36, తాడిపత్రి 34.4, పామిడి 25.4 , గుంతకల్లు 24.4, ఉరవకొండ 23.4, గార్లదిన్నె 22.6, ఆత్మకూరు 19, పుట్లూరు 18.2, కళ్యాణదుర్గం 16.4, గుత్తి 16.2 మి.మీ వర్షపాతం నమోదైంది. శింగనమల, యాడికి, కణేకల్లు, రాప్తాడు, కూడేరు, అనంతపురం, బుక్కరాయసముద్రం, నార్పల, రాయదుర్గం తదితర మండలాల్లో మోస్తరుగా వర్షం కురిసింది. జూన్ నెల సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా ఇప్పటికే 139 మి.మీ పైబడి వర్షపాతం నమోదైంది. ఈ 14 రోజుల్లోనే 10 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదు కావడం విశేషం.

అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

- షెడ్యూల్ ప్రకారం తనిఖీలు చేయాలి
- హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులకు కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: నీటి ప్రాజెక్టుల నిర్వహణ విషయంలో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పరిధిలో షెడ్యూల్ ప్రకారం తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రాజెక్టు ఎస్ఈ, ఈఈలు, డీఈఈలు, ఏఈఈలతో సమీక్షించారు. ఆయా శాఖల పరిధిలోని రిజర్వాయర్లు, కాలువలు, ఆయకట్టు, అధికారులు, సిబ్బంది తదితర వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రణాళిక ప్రకారం పనిచేయాలన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్, హెచ్ఎల్‌సీ, మైనర్ ఇరిగేషన్ శాఖల ఎస్ఈలు ప్రతినెలా టూర్ డైరీ అందించాలన్నారు. ప్రాజెక్టు పరిధిలో సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. నీటి ప్రాజెక్టుల ఎస్ఈలు ప్రతినెలా ప్రధాన కార్యాలయాలకు వెళ్లి జిల్లాలోని సమస్యలను రాష్ట్రస్థాయిలో ప్రస్తావించాలన్నారు. ప్రాజెక్టులు, కాలువల వివరాలపై గూగుల్ మ్యాప్ తయారు చేసి అందించాలని ఆదేశించారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, రిజర్వాయర్ల వద్ద చెట్లు, మొక్కల పెంపకానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పెన్నా నదీ పరివాహక ప్రాంతంలో గట్ల వెంబడి మొక్కల పెంపకం చేపట్టాలని చెప్పారు. సమావేశంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశేనాయక్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, వెన్నెల శ్రీను, ఈఈలు రాజస్వరూప్ కుమార్, నారాయణనాయక్, ప్రతాప్, శ్రీనివాస నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బుజ్జి క్రిస్టినా.. నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోన!

అనంతపురం అర్బన్/గుంతకల్లు: 3 నెలల 15 రోజుల వయసులో 149 ఫ్లాష్ కార్డ్‌లను గుర్తించి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో బుజ్జి క్రిస్టినా సియారా తన పేరు లిఖించుకుంది. ఆమె తల్లిదండ్రులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అభినందించారు. గుంతకల్లు పట్టణం మోదీనాబాద్‌కు చెందిన రైల్వే ఉద్యోగి పి.సుధాకర్, సింధుల నాలుగు నెలల సంతానం క్రిస్టినా సియారా. ఈ చిన్నారి ఫ్లాష్ కార్డులను (అక్షరాలు, జంతువులు, పండ్లు, పక్షులు, తదితర వంటివి) గుర్తించడంతో అతిచిన్న వయసు కలిగినదిగా నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పేరు నమోదైంది. ఈ క్రమంలోనే కలెక్టర్‌ను గురువారం చిన్నారితో పాటు తల్లిదండ్రులు కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. చిన్నారిలో ఎంతో ప్రతిభ ఉందని, భవిష్యత్తులోనూ పాపకు ప్రోత్సాహం అందించాలని సూచించారు.



క్రిస్టినా సియారాను అభినందిస్తున్న కలెక్టర్, చిత్రంలో చిన్నారి తల్లిదండ్రులు సింధు, సుధాకర్

చిన్నారి తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇంతకు ముందు కర్ణాటకకు చెందిన ఓ పాప 125 ఫ్లాష్ కార్డులను గుర్తించిందని, ఆ రికార్డును క్రిస్టినా సియారా చెరిపివేసిందన్నారు. ఈనెల 7న 3 నెలల 15 రోజుల వయసులో వరల్డ్ రికార్డు నెలకొల్పిందన్నారు. కలెక్టర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్యవివాహాలు అరికట్టాలి

జిల్లాలో బాల్యవివాహాలను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. బాలల పరిరక్షణ సమితి, చైల్డ్ హెల్ప్‌లైన్, ఐసీడీఎస్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాలకు సంబంధించి సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని నియంత్రించాలన్నారు. జువైనల్ జస్టిస్, పోక్సో, పీసీపీఎన్‌డీటీ, రైట్‌టూ ఎడ్యుకేషన్, తలాక్ సిస్టం వంటి ఎనిమిది రకాల చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఒక్కో అంశానికి ఒక అధికారిని కేటాయించాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, బాలల పరిరక్షణ సమితి అధికారి మంజునాథ్ పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి

జిల్లాలో రహదారుల వార్షిక నిర్వహణకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆర్అండ్‌బీ కార్యకలాపాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్అండ్‌బీ పరిధిలో ఎన్ని కిలోమీటర్ల రహదారులు ఉన్నాయి, మరమ్మతుల వివరాలు, పనుల పురోగతి, అధికారులు, సిబ్బంది, తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈలు రాజగోపాల్, వెంకటరమణ, డీఈఈలు బాలకాటమయ్య, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీటీసీ థియరీ పరీక్ష ఫీజు చెల్లించండి

అనంతపురం ఎడ్యుకేషన్: ఆగస్టులో జరగనున్న టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షలకు సంబంధించిన ఫీజును జూలై 1లోగా చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీటీసీ 42 రోజుల శిక్షణ కోర్సు చేస్తున్న అభ్యర్థులు, గతంలో టీటీసీ థియరీ పరీక్ష రాసి ఫెయిల్ అయిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫీజు మొత్తాన్ని కోర్స్ డైరెక్టర్‌కు చెల్లిస్తే ఆయన ఆన్‌లైన్‌లో చెల్లిస్తారని పేర్కొన్నారు. రూ. 150 అపరాధ రుసుంతో జూలై 6వరకు చెల్లించవచ్చని వెల్లడించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యానువల్ చలాన్లు ఆమోదించమని స్పష్టం చేశారు.

నైపుణ్యంతో సులువుగా ఉపాధి అవకాశాలు

అనంతపురం ఎడ్యుకేషన్: వృత్తి నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు సులభంగా లభిస్తాయని జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎ.కళ్యాణి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో గురువారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధి కల్పనశాఖ అధికారి కళ్యాణి మాట్లాడుతూ చదువుతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కోర్సులు చేయాలన్నారు. ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి మాట్లాడుతూ విప్రో, అల్ట్రాటెక్ తదితర కంపెనీలు హాజరయ్యాయన్నారు. జిల్లాలోని అన్ని ఐటీల నుంచి 242 మంది విద్యార్థులు హాజరుకాగా 95 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. తాడిపత్రి ఐటీఐ ప్రిన్సిపాల్ మంతేశులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాక్సులు చూపుతున్న సెబ్ పోలీసులు

రాయదుర్గం: జిల్లాలోకి అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం స్థానిక సెబ్ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆ విభాగం సీఐ మురళీమోహన్ వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారంతో రాయదుర్గం మండలం కాశీపురం – కెంచానపల్లి గ్రామాల మధ్య మారెమ్మ ఆలయం వద్ద గురువారం ఉదయం సెబ్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఏపీ02 సీహెచ్ 6055 నంబర్ గల కారును ఆపి తనిఖీ చేస్తే అందులో 90 ఎంఎల్ సామర్థ్యమున్న 10 బాక్సుల టెట్రాప్యాకెట్లు బయటపడ్డాయి. మద్యం స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. మద్యం తరలిస్తున్న రేకులకుంట వరప్రసాద్, భూపసముద్రం బోయ సురేష్, గోనబావి గొడ్డల జయలక్ష్మిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

జాతీయ రహదారిపై వృద్ధుడి మృతదేహం



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

రాప్తాడు: మండలంలోని 44వ జాతీయ రహదారిపై డాల్ఫిన్ హోటల్ వద్ద ఓ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు రాప్తాడు సీఐ మునిస్వామి తెలిపారు. స్థానికులు గుర్తించి డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో సిబ్బందితో కలసి అక్కడికెళ్లి పరిశీలించినట్లు వివరించారు. మృతుడికి దాదాపు 65 సంవత్సరాల వయసు ఉంటుందని, సంబంధీకులు ఎవరైనా గుర్తించి అనంతపురంలోని సర్వజనాస్పత్రి వద్ద రెండు రోజుల్లోపు సరైన ఆధారాలు సమర్పిస్తే మృతదేహాన్ని అప్పగిస్తామన్నారు.

రక్తదాత సుఖీభవ

గుంతకల్లు: అత్యవసర సమయంలో మనిషి ప్రాణాలు నిలబెట్టి పునర్జన్మనిచ్చే రక్తదానాన్ని మించిన గొప్పదానం మరొకటి లేదు. ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని ఇవ్వడం ద్వారా ప్రాణదాతలుగా మారుతారు. ఈ క్రమంలో రక్తదానంపై ప్రజలను చైతన్య పరచడంతో పాటు దాతల ఔదార్యాన్ని కొనియాడేందుకు ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం జరుపుకుంటున్నారు. 1901లో ఆస్ట్రేలియాకు చెందిన కార్ల్‌లాండ్ స్టీనర్ మొదట రక్తాన్ని వర్గీకరించారు. దీంతో ఆయన పుట్టిన జూన్ 14న ప్రపంచ రక్తదాన దినోత్సవంగా ప్రకటించి, మొట్టమొదటి సారిగా 2004లో రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి గత 20 ఏళ్లుగా ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినం జరుపుకుంటున్నారు.

ఒకప్పుడు ప్రాధేయపడినా..

గతంలో అత్యవసరమని ప్రాధేయపడిన రక్తదానం చేసేందుకు ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. అత్యవసర సమయంలో రక్తం అందక అప్పట్లో చాలా మంది మృత్యువాత పడుతూ వచ్చారు. ఈ క్రమంలో రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన అతి కొద్ది మంది అత్యవసర సమయంలో రక్తదానంతో వ్యక్తి ప్రాణాలు ఎలా కాపాడవచ్చో నిరూపితం చేస్తూ ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు ముమ్మరం చేశారు. రక్తాదానం మనిషి ప్రాణాలను కాపాడుతుందని, అన్ని దానాల కల్లా రక్తదానం గొప్పదనే అంశాన్ని ప్రజల మదిలో బలంగా నాటుకుపోయేలా చేశారు. రక్తదానాన్ని ఉద్యమంలా తీసుకెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించి ప్రాణదాతలుగా మారే బృహత్తర అవకాశాన్ని కల్పించారు. జిల్లాలో నేడు వేలాది మంది తమ రక్తాన్ని స్వచ్ఛందంగా దానం చేసేందుకు ముందుకు వస్తున్నారు. ముందస్తుగానే బ్లడ్ బ్యాంక్‌ల్లో రక్తం నిల్వలు ఉండేలా చొరవ చూపడంతో పాటు అత్యవసర



రక్తదానం చేస్తున్న యువకులు (ఫైల్)

సమయంలో ఎంత దూరమైనా ప్రయాణించి రక్తదానం చేస్తున్నారు.

రక్తదానం వల్ల లాభాలు

క్రమం తప్పకుండా రక్తదానం చేయడం వల్ల మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని నిపుణులు చెబుతున్నారు. గుండె జబ్బుల ప్రమాదాన్ని పూర్తిగా తగ్గిస్తుందని అంటున్నారు. రక్తప్రసరణ మెరుగుపడి బీపీ నియంత్రణలో ఉంటుంది. క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చు. బరువు తగ్గడానికి దోహదపడుతుంది. రక్తదానం చేసినప్పుడు శరీరం కోల్పోయిన రక్త కణాలను తిరిగి నింపుతుంది. ఎముక మజ్జ తాజా రక్త కణాలను ఉత్పత్తి చేస్తుంది. రక్తదానం చర్మానికి మేలు చేస్తుంది. మొటిమలు, ఇతర చర్మ సంబంధిత రుగ్మతలు తొలిగిపోతాయి. అన్నింటి కంటే ముఖ్యంగా రక్తదానం వల్ల ఒకరి ప్రాణం నిలబడుతుంది.

సమాచారం ఇస్తే చాలు..

రక్తం అవసరం ఏర్పడితే వెంటనే వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో సమాచారం పోస్టు చేస్తే చాలు వేలాది మంది దాతలు ముందుకు వస్తున్నారు. కొంత మంది దూర ప్రాంతాలకు సైతం వెళ్లి రక్తదానంతో ప్రాణదాతలుగా మారుతున్నారు. ఈ క్రమంలో కొన్ని సేవా సంస్థలు, ప్రభుత్వ శాఖలు నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలకు విశేష ఆదరణ లభిస్తోంది. చాలామంది ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వస్తున్నారు. గుంతకల్లు ఇటీవల పలు బ్లడ్ క్యాంపులు నిర్వహించి ప్రభుత్వ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో అవసరమైన మేర రక్తాన్ని నిల్వ ఉంచారు. గుంతకల్లులో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు వెయ్యి యూనిట్ల రక్తం సేకరించారు.

సందర్భం: నేడు రక్తదాతల దినోత్సవం



ఎంతో మందికి పునర్జన్మ



రక్తదానం వల్ల ఎంతో మంది పునర్జన్మ పొందారు. రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు చాలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ఫలితంగా నేడు వందలాది మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావడం చాలా సంతోషం.

– హరిప్రసాద్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి, గుంతకల్లు

33 సార్లు రక్తదానం చేశాను



నా వయస్సు 35 సంవత్సరాలు. అరుదైన బాంబే ఓ నెగిటివ్ బ్లడ్ గ్రూప్ నాది. ఇప్పటి వరకూ 33 సార్లు రక్తదానం చేశాను. మా అబ్బాయి కూడ ఓ నెగిటివ్ బ్లడ్. అరుదైన బ్లడ్ గ్రూప్ కావడంతో రక్త అవసరమని ఫోన్ వచ్చిన ప్రతి సారి అక్కడికెళ్లి రక్తదానం చేస్తుంటాం.

– పరుశురాం, రక్తదాత, గుంతకల్లు

ప్రాసెసింగ్ సెంటర్ పరిశీలన



ప్రాసెసింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం రూరల్: మండల పరిధిలోని వెంకటంపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్‌ను గురువారం ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఇన్‌చార్జ్ జిల్లా ఉద్యాన అధికారి ఫిరోజ్ ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. రైతు సంఘాలతో కలిగే లాభాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఉద్యాన అధికారి కృష్ణతేజ, ఏఎఫ్ఈసీ మురళి, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై ఎలుగుబంటి దాడి

రాయదుర్గం రూరల్: ఎలుగుబంటి దాడిలో గొర్రెల కాపరి గాయపడ్డాడు. వివరాలు... రాయదుర్గం మండలం చదం గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన గొల్ల జడప్ప గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం 10.30 గంటలకు తనకున్న గొర్రెలను మేపునకు గ్రామ సమీపంలోని గట్ట మల్లేశ్వర కొండ వెనుక వైపు తోలుకెళ్లాడు. ఆ సమయంలో ఉన్నఫళంగా పొదల్లో నుంచి వచ్చిన ఎలుగుబంటి... జడప్ప ఎడమకాలిపై దాడి చేసింది. తేరుకున్న ఆయన వెంటనే చేతిలో ఉన్న కర్రతో ఎదురుదాడికి దిగుతూ గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని మరికొందరు కాపర్లు అక్కడకు చేరుకుని ఎలుగుబంటిని తరిమేశారు. క్షతగాత్రుడిని రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

కుక్కల దాడిలో జింక మృతి



తాడిపత్రి అర్బన్: కుక్కల దాడిలో ఓ జింక మృతి చెందింది. వివరాలు.. తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డులో ఉన్న ఓ మద్యం దుకాణం వద్దకు గురువారం ఉదయం వచ్చిన ఓ జింకను గమనించిన వీధికుక్కలు తరుముకుంటూ వెళ్లి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు గమనించి అడ్డుకునేలోపు తీవ్రంగా గాయపడిన జింక మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకుని జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. పంచనామా అనంతరం ఖననం చేశారు.

కొడవళ్లు పట్టుకుని చంపుతామంటూ...

- అనంతపురం రూరల్ కక్కలపల్లిలో టీడీపీ కార్యకర్తల హల్‌చల్
- తనను హత మార్చేందుకే వచ్చారన్న సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తలు కొడవళ్లు పట్టుకుని చంపుతామంటూ భయోత్పాతం సృష్టించారు. అయితే తనను హత మార్చేందుకే వచ్చారంటూ సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య వాపోయాడు. ఆయన తెలిపిన వివరాలు... గురువారం సాయంత్రం గ్రామ సమీపంలోని తన తోటలో సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య, మరో ఇద్దరితో ఉన్నాడు. వర్షం కురుస్తుండడంతో షెడ్డులోకి వెళ్లారు. అదే సమయంలో తన డ్రైవర్ చాంద్‌బాషా బయట ఉన్న వాహనం వద్దకెళ్లినప్పుడు అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు నాగార్జున, సుధీర్‌రెడ్డి కొడవళ్లు చేతుల్లో పట్టుకుని కనిపించారు. సర్పంచ్‌ను చంపుతామని హెచ్చరించడంతో భయాందోళనకు గురైన చాంద్‌బాషా వెంటనే షెడ్డులోకి వెళ్లి కృష్ణయ్యకు విషయం తెలిపాడు. దీంతో తలుపులు వేసి వెంటనే పోలీసులు, సమీప బీజేపీ కాలనీలోని కొందరికి ఆయన ఫోన్లు చేశారు. బీజేపీ కాలనీ నుంచి కొందరు రావడంతో సర్పంచ్ షెడ్డు నుంచి బయటకు రావడం చూసిన నాగార్జున, సుధీర్‌రెడ్డి అక్కడి నుంచి పరారయ్యారు. ఇంతలో సీఐ రామకృష్ణారెడ్డి కూడా అక్కడికి చేరుకుని, గాలింపు చేపట్టారు. సర్పంచ్ తోట సమీపంలోని భవిష్య డ్రిప్ కంపెనీ వద్ద కనిపించిన మరో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు పోలీసులను చూడగానే ఉడాయించారు. సీఐ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా ఇలాంటి ఘటనలకు పాల్పడితే తాట తీస్తామని హెచ్చరించారు. గ్రామాలు ప్రశాంతంగా ఉండాలని అనవసరంగా గొడవలకు పాల్పడి అలజడులు సృష్టిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

జీవాలకూ గైనిక్ క్యాంపు

అనంతపురం అగ్రికల్చర్: వర్షాకాలంలో పశువులు, జీవాల్లో అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై ప్రతి మండలంలో గైనిక్‌క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం స్థానిక పశుశాఖ డీడీ కార్యాలయ హాలులో డివిజన్ డీడీ డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ) ఈవో డాక్టర్ టి.సుధాకర్‌తో కలిసి అనంతపురం, రాప్తాడు, బుక్కరాయసముద్రం, గుత్తి, శింగనమల ఏరియా ఆసుపత్రుల ఏడీలు, డాక్టర్లు, ఇతర పారా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ... వ్యాధులు సోకకుండా, వైద్య చికిత్సలు, సలహాలు ఇవ్వడానికి రోజుకో మండల కేంద్రంలో గైనిక్ క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు. ఒకట్రెండు రోజుల్లో షెడ్యూల్ ఇస్తామన్నారు. ఇప్పటికే అవసరమైన మందులు, వైద్య సామగ్రి సరఫరా చేశామని తెలిపారు. ఇక ఎమర్జెన్సీ కింద వైద్య చికిత్సలు, శస్త్రచికిత్సలు ఇతరత్రా తక్షణ వైద్య సహాయం అందించడానికి వీలుగా ప్రతి మండలంలో ముగ్గురు నిష్ణాతులైన డాక్టర్లతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమాచారం అందిన గంటల వ్యవధిలోనే ర్యాపిడ్ టీం చేరుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. పాడి అభివృద్ధి, పశుసంతానోత్పత్తి పెంపు లక్ష్యంగా సెక్స్ సార్టెడ్ సెమన్ ద్వారా కృత్రిమ గర్భధారణను ప్రోత్సహించాలన్నారు. వీటి ద్వారా 90 శాతం ఆడ దూడలే పుట్టే అవకాశం ఉన్నందున దీన్ని రైతులు వినియోగించుకునేలా చూడాలన్నారు. విస్తారంగా వర్షాలు వస్తున్నందున ముందు గడ్డి కొరత ఏర్పడకుండా ప్రతి రైతూ అంతో ఇంతో విస్తీర్ణంలో పశుగ్రాసాలు పెంచుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.



మాట్లాడుతున్న పశుశాఖ జేడీ సుబ్రహ్మణ్యం

ప్రభుత్వ ఆస్తుల జోలికెళితే తాట తీస్తా



చందనలో మాట్లాడుతున్న సీఐ నాగార్జునరెడ్డి

యాడికి: ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి పాల్పడితే తాట తీస్తానని దుండగులను యాడికి సీఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. మండలంలోని చందన గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం శిలాఫలకాలను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై ఫిర్యాదులు అందుకున్న సీఐ నాగార్జున రెడ్డి గురువారం ఉదయం తహసీల్దార్ మోహనవల్లి, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లుతో కలసి ఎంపీడీఓ సమావేశ మందిరంలో మండలంలోని రెవెన్యూ, సచివాలయాల సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద వీఆర్‌ఏలు, సచివాలయాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని భరోసానిచ్చారు. అనంతరం సాయంత్రం చందన గ్రామంలో సీఐ పర్యటించి గ్రామసభ ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీలకు గెలుపు, ఓటములు సహజమన్నారు. శిలాఫలకాలను ధ్వంసం చేసే విష సంస్కృతిని వీడాలని హితవు పలికారు.

హైరిస్క్ గర్భిణుల గుర్తింపులోనూ నిర్లక్ష్యమా?

- బీపీ, హెచ్‌బీ కూడా చూడకపోతే ఎలా?
- డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి ఆగ్రహం

అనంతపురం మెడికల్: పీహెచ్‌సీల పరిధిలో గర్భిణులకు బీపీ, హెచ్‌బీ పరీక్షలు కూడా నిర్వహించకుండా, ఆరోగ్య పరిస్థితి నార్మల్‌గా ఉందని జీజీహెచ్‌కు పంపుతున్నారని, హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి అన్నారు. గత నెలలో జరిగిన మూడు మాతృ, 6 శిశు మరణాలపై గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్, గైనకాలజిస్టులు, పీహెచ్‌సీ వైద్యుల తప్పిదాలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను చివరి నిమిషంలో సర్వజనాస్పత్రికి పంపుతున్నారన్నారు. క్షేత్ర స్థాయిలోనే ఎప్పటికప్పుడు బీపీ, హెచ్‌బీ తదితర పరీక్షలు చేసి సమస్య తీవ్రంగా ఉంటే ఇక్కడికి పంపాల్సి ఉందన్నారు. అలా కాకుండా, ఎటువంటి సమస్య లేదని పుస్తకాల్లో నమోదు చేస్తే సరిపోదని పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఏఎన్ఎం, ఆశాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 9 నెలలు నిండిన గర్భిణికి కచ్చితంగా వారానికోసారి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం పొందేలా చూడాలన్నారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ యుగంధర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్, గైనకాలజిస్టు డాక్టర్ రేణుక, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శంకర్ నారాయణ, ఎంపీహెచ్ఈఓ లక్ష్మణ్ణ, ఎంపీహెచ్ఎస్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.



యల్లనూరు పీహెచ్‌సీ వైద్యులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

మహిమాన్వితం.. కాశీవిశ్వేశ్వరాలయం

- దాదాపు ఆరు శతాబ్దాల ఘన చరిత్ర
- కోరిన కోర్కెలు తీర్చే బోళాశంకరుడు
- వారం పొడవునా విశేష అభిషేకాలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రం బుక్కరాయసముద్రం సమీపంలో ముసలమ్మ కట్ట వద్ద వెలసిన కాశీ విశ్వేశ్వర ఆలయం అత్యంత మహిమాన్వితమైన క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఇక్కడ వెలసిన భోళాశంకరుడిని పూజిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని ప్రసిద్ధి. పచ్చని చెట్ల నడుమ ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన ఈ ఆలయంలో వారం పొడవునా విశేష అభిషేకాలు నిర్వహిస్తుంటారు. ప్రత్యేకించి సోమవారం నాడు ఇక్కడి శివలింగానికి అభిషేకించి హరహర మహాదేవ శంభోశంకరా....అంటూ ప్రార్థిస్తే జన్మ సుకృతమవుతుందని పెద్దలు అంటున్నారు.

ఆలయ చరిత్ర

బుక్కరాయసముద్రం – అనంతపురం నగరం మధ్యన ముసలమ్మ కట్ట వద్ద వెలసిన కాశీ విశ్వేశ్వరాలయానికి దాదాపు ఆరు వందల సంవత్సరాల ఘనమైన చరిత్ర ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అప్పట్లో కాశీ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన శివలింగాన్ని ఇక్కడ ప్రతిష్ఠించి విశేష పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఆలయానికి దక్షిణాన శ్మశాన వాటిక ఉంది. దీంతో ఈ ఆలయాన్ని దక్షిణ కాశీగా అభివర్ణిస్తుంటారు. ప్రధాన ఆలయం పక్కనే ఉప ఆలయాలూ ఉన్నాయి. గర్భగుడి ఎదుట పుష్కరిణి ఎంతో చూడముచ్చటగా ఉంది. భూగర్భంలోనే ఉండిపోయిన ఈ పుష్కరిణిని కొన్ని దశాబ్దాల క్రితం గుర్తించి అభివృద్ధి చేశారు. ఉప ఆలయాల్లో వెలసిన కాశీ విశాలాక్షి, వినాయక, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప స్వామి ఆలయాల్లోనూ రోజూ విశేష పూజలు నిర్వహిస్తుంటారు. ప్రత్యేకించి ఆది, సోమ, మంగళ, శుక్రవారాల్లో అమ్మవారి ఆలయంలో, బుధవారం నాడు వినాయక మందిరంలో ఆది, మంగళ వారాల్లో సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు పెద్ద ఎత్తున సాగుతుంటాయి. ఆలయ ప్రాంగణంలో వెలసిన నాగుల కట్ట, నవగ్రహాల వద్ద నిర్ణీత రోజుల్లో పూజలు నిర్వహిస్తే సకల దోషాలు పరిహారమవుతాయని భక్తుల నమ్మకం.

ప్రళయాన్ని తట్టుకుని...

ప్రళయం... అందులోను జలప్రళయం సంభవిస్తే భూమి పై ఏమీ మిగలదని చరిత్రకారులు చెబుతుంటారు. సమస్త జీవరాశి ఆ జలప్రళయంలో కొట్టుకుపోవల్సిందేనని అంటుంటారు. మరి అంతటి జలప్రళయాన్ని కూడా తట్టుకుని నిలబడే శక్తి కేవలం ఈ ఒక్క ప్రాంతానికే ఉందని ఆలయ చరిత్ర చెబుతోంది. 'పూర్వం భారీ వర్షం కారణంగా బుక్కరాయసముద్రం చెరువు మొత్తం నిండిపోయింది.అయినా వర్షం కుండపోతగా కురుస్తుడడంతో ఆ చెరువు కట్ట తెగిపోయి నీరు మొత్తం ఊరిలోకి ప్రవేశిస్తున్నాయి. భయభ్రాంతులైన గ్రామ ప్రజలు గ్రామ దేవత అయిన పోలేరమ్మను ప్రార్థిస్తే.. చెరువు చుట్టూ చేరిన ప్రజలను ఉద్దేశించి ఆకాశవాణి మాట్లాడుతుంది. ఈ ప్రమాదం నుంచి గ్రామ ప్రజలను కాపాడాలంటే అదే ఊరిలో నివసిస్తున్న బసిరెడ్డి చిన్న కోడలు ముసలమ్మని చెరువుకట్టకు బలి ఇస్తే జల ప్రళయం నిలుస్తుందని చెబుతుంది. దీంతో తన ప్రాణత్యాగంతో గ్రామ ప్రజలను ముసలమ్మ కాపాడుతుంది'. నాడు సంభవించిన జల ప్రళయంలోనూ కాశీ విశ్వేశరాలయం చెక్కు చెదరకుండా నిలిచి ఉంది. అంతే కాక ప్రాణత్యాగంతో జల ప్రళయాన్ని నివారించిన ముసలమ్మను కీర్తిస్తూ ఆమెను దేవతాస్వరూపంగా గ్రామ ప్రజలు కొలుస్తూ వచ్చారు. ముసలమ్మ పేరుతో కాశీవిశ్వేశ్వర ఆలయం సమీపంలోనే ప్రత్యేకంగా ఆలయాన్ని నిర్మించి, పూజాదికాలు నిర్వహిస్తున్నారు.

స్పర్శ దర్శనంతో అభిషేకాలు

మహా శివలింగాన్ని స్వయంగా చేతితో తాకి మొక్కాలని ప్రతి ఒక్కరూ భావిస్తుంటారు. అయితే ఆలయ ధర్మాలు అందుకు అంగీకరించకపోవడంతో ఈ కోరిక నెరవేరకుండా పోతోంది. అయితే కాశీలో తరహాలోనే బుక్కరాయసముద్రంలో వెలసిన కాశీవిశ్వేశ్వరాలయంలోనూ స్పర్శదర్శనంతో అభిషేకాలు నిర్వహించే బృహత్తర అవకాశం ఆది నుంచి వస్తోంది. ఆలయం ఆవిర్భవం నుంచి ఈ పంథాను కొనసాగిస్తూ వస్తున్నట్లు పెద్దలు అంటున్నారు. దీంతో ప్రతి సోమవారం ఆలయంలో మహాశివుడికి అభిషేకాలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుంటారు. అయితే ఆలయ నిబంధనల మేరకు భక్తులు తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాల్సి ఉంటుంది. వివాహాది శుభకార్యాలు జరుపుకునేందుకు ఆలయ ప్రాంగణంలో సువిశాలమైన కల్యాణమంటపాన్ని నిర్మించారు. కార్తీకం, మాఘ మాసాల్లో ఉమ్మడి జిల్లాతో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటుంటారు.



కాశీవిశ్వేశ్వర ఆలయం(ఇన్‌సెట్‌లో) విశేష అలంకరణలో దర్శనమిస్తున్న శివలింగం

చూసొద్దాం

పీఠం ఏర్పాటు



పీఠాధిపతి అన్నామలై స్వామి

కాశీ విశ్వేశ్వరాలయానికి ప్రత్యేకించి ఓ పీఠాన్ని ఏర్పాటు చేశారు. పీఠాధిపతులుగా వ్యవహరించిన వారిలో మణిస్వామి ముఖ్యులు. ఎందరో భక్తుల సాదకబాధకాలను ఆయన దూరం చేశారనే ఖ్యాతి ఉంది. 2017, జనవరి 5న ఆయన శివైక్యం చెందారు. అనంతరం అదే ఏడాది ఫిబ్రవరిలో ఆలయ పీఠాధిపతిగా అన్నామలై స్వామి బాధ్యతలు స్వీకరించి, శివారాధనపై ప్రజలను చైతన్య పరుస్తూ ఆలయ అభివృద్ధికి బాటలు వేశారు. ఆయన బోధనలతో చైతన్యం పొందిన వేలాది మంది ఏటా శివ మాల ధరించి జీవన స్థితిగతులను మెరుగు పరుచుకుంటున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

B.Tech. ADMISSIONS

■ AP EAPCETలో క్వాలిఫైడ్ స్టూడెంట్స్‌కి, B.Tech (Any Branch)లో ఫ్రీ ఎడ్యుకేషన్ కలదు. క్వాలిఫై కాని వారు Only హాస్టల్ ఫీజు కట్టుకోవలెను. కాలేజీ ఫీజు ఉండదు. సంప్ర: జి.మురళీ, సెల్ : 9030661651. అనంతపురము. [A-1244]

REAL ESTATE

SHOP FOR RENT

■ షాపు రూమ్ బాడుగకు, శ్రీకంఠం సర్కిల్ నందు బస్టాండ్ కు పోవు దారిలో కమర్షియల్ షాపు రూమ్ బాడుగకు కలదు. సంప్రదించండి . Cont :7013324050. [A-153]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V- 6500]

ఉష ఫ్యాషన్ డిజైనర్

■ టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్, మారుతీ నగర్, 3వ క్రాస్, ఆర్.యస్. రెసిడెన్సీ, ఫ్లాట్ నెం. 103, అనంతపురము. సంప్ర: సెల్ : 72072 12027. [A-161]

CHANGE OF NAME

■ I, B.K.VENKATESH (Old Name) S/o B.KRISTAPPA, R/o D. No:11-3-4, Fort, Hindupur Town & Mandal, Sri Sathyasai Dist., I am also known as B.K.VENKATESULU (New Name). Above said both names are one and the same person belongs to me only. [A-1246]

CHANGE OF NAME

■ I, VALIPIREDDY ARUNA DEVI (Old Name) R/o 13-476-1-1, Prasanthi Nagar, Putluru Road, Tadipatri (T), Anantapur (D), A.P. I Have been change my surname & Name from VALIPIREDDY ARUNA DEVI to KONA ARUNA, Henceforth my Surname & Name known as KONA ARUNA for all purpose. [A-1247]

BUSINESS OFFER

■ లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్ స్థాపించండి. ప్లాస్టిక్ ఉద్యోగ్‌తో బై బ్యాక్ అగ్రిమెంట్. (Govt. అప్రూవ్) 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-5787]

WANTED

■ ఎయిర్‌టెల్ ఫైబర్ బిజినెస్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయుటకు స్త్రీ/పురుష అభ్యర్థులు కావలెను. జీతం: 15 వేలు నుండి 20 వేలు వరకు. కాల్: 8686155567 / 9989099057. [HA-1931]

■ WANTED Required P.E.T s, Principal and High School Teachers and Lectures for all subjects. Interview Date: 19, 20 June 2024. Contact: 8019855845. [A-7002]

■ అనంతపురములోని పేరుగాంచిన Inter College నందు Tutors, Wardens, Seavengers, Attenders, Sweepers, Physics, English Lecturers కావలెను. 9866117303, 6281158454 [A-7003]

■ PCMR E.M. SCHOOL Wanted Social Studies Teachers for High School and Primary Classes 1st to 5th & 6th to 10th & Physics Teacher 6 to 10th. Ph: 9505292219, 9885386684. [A-762314]

■ Job Openings : అనంతపురం లో, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ – 3, Q: MBA (MARKETING), అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన శాలరీ. సంప్ర: ఉదయ్ ఫుడ్ & బేవరేజెస్, ATP. సెల్: 9908612561. [A-1245]

■ Manas TV19 Youtube Channel నందు మండల ఇంచార్జులు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ఎడిటర్స్, యాంకర్స్ కావలెను. 9515983309 [G-2108]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సాప్ చేయగలరు. 95026 15217 [M-1185208]

■ తిరుపతి, తిరుమలలో & మంగంపేట పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, SO, ASO లు కావలెను. భోజనము, వసతి కలదు. 9100518607, 9515488473. [T-2116]

■ Wanted Qua & Exp. IIT Chy (6th to 9th) 35K, IIT Phy (6th to 9th) 35K, Science (6th to 7th) 18K with food & Accom. St. Antony's School, Porumamilla, Kadapa(Dist) Cell: 9319979999 [C-1254158]

■ Sanjay Ghodawat యూనివర్సిటీకి B.Tech / Admisions చేయుటకు Lady Tele Counselleros కావలెను. Office or Work From Home. Qlf: Any Degree. సంప్రదించండి: 99598 99798, 96400 60006. [NA-23499]

■ దండపాని రియల్‌ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ అర్హత ఇంటర్ ఆపైన, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ ఫిక్స్‌డ్ శాలరీ 10000, నో టార్గెట్ అనుభవం కలవారికి ప్రాధాన్యత ఫ్లాట్ నెంబర్ 204, లోటస్ గ్రాండ్, రాంనగర్ అనంతపురం Cont: 6300725354 [A-162]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

కలెక్టర్‌కు ధన్యవాదాలు



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలియ జేస్తున్న ఏపీజేఏసీ అమరావతి జిల్లా నాయకులు

అనంతపురం అర్బన్: ఉద్యోగులు, ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించారంటూ కలెక్టర్ వి.వినోద్ కుమార్‌కు ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు ధన్యవాదాలు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామృష్ణారెడ్డిలను కూడా కలిసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్, మహిళా విభాగం చైర్‌పర్సన్ సురేఖరావు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప, రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్, నాయకులు మల్లరాయుడు, పీఎస్ ఖాన్, తోట చెన్నప్ప, రాము, మల్లేష్, భరత్ కృష్ణజ్యోతి, నీరజకుమారి, నాగవేణి, తదితరులున్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌తో 'క్షయ'కు చెక్



మేడాపురంలో ఓ వ్యక్తికి బీసీజీ టీకా వేస్తున్న ఏఎన్‌ఎం

కనగానపల్లి: బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ వ్యాధికి చెక్ పెట్టొచ్చని పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఆరోగ్య సిబ్బంది ప్రజలకు బీసీజీ వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది క్షయ వ్యాధికి గల కారణాలు, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకూ సుమారు 1450 మందికి బీసీజీ వ్యాక్సిన్లు వేసినట్లు వైద్యులు తెలిపారు. ముక్తాపురం గ్రామ సచివాలయం వద్ద సీహెచ్‌ఓ నాయక్, హెల్త్ అసిస్టెంట్ మోహన్, ఏఎన్‌ఎం లక్ష్మి ఆధ్వర్యంలో పలువురికి బీసీజీ వ్యాక్సిన్లు వేశారు.

చెన్నేకొత్తపల్లి: ఎన్‌ఎస్‌గేట్ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది గురువారం క్షయ వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఎన్‌ఎస్‌గేట్ డాక్టర్ రవినాయక్, డాక్టర్ ఉదయ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని ఏఎన్‌ఎంలు, సూపర్ వైజర్లు, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనాథకు చేయూత



అలేఖ్యకు సాయం అందిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: నగర శివార్లలో ఉండే అలేఖ్య అనే విద్యార్థిని తన తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయింది. అండగా ఉన్న తండ్రి విద్యుదాఘాతంతో ఇటీవల మరణించడంతో 9వ తరగతి చదువుతున్న అలేఖ్య ఇబ్బందులు ఎదుర్కొంటోంది. విషయం తెలుసుకున్న రోటరీక్లబ్ చిల్డ్రన్ సర్వీస్ వింగ్ చైర్మన్ శాంతరాజ్ ఇతర సభ్యులతో కలిసి గురువారం బాలికకు ఆర్థికసాయంతో పాటు నిత్యావసర వస్తువులు, కాస్మోటిక్స్, దుస్తులు, బెడ్‌షీట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతలెవరైనా ఇంకా సాయమందిస్తే అనాథనన్న భావన లేకుండా చదువుకుంటుందన్న విశ్వాసం వెలిబుచ్చారు.

పౌష్టికాహారం అందించాలి



మామిళ్లపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

కనగానపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందించాలని ఎంఈఓ శ్రీదేవి ఎండీఎం ఏజెన్సీ సభ్యులు, ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని మామిళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఆమె విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంట గది, ఆహార పదార్థాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పరిశుభ్రతతో కూడిన పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం స్నేహలత, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు పక్కాగా చేపట్టాలి



నడిమివంకను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం కార్పొరేషన్: నడిమివంక, మరువ వంకతో పాటు నగరంలోని పెద్ద కాలువల్లో పూడికతీత పనులు పక్కాగా చేపట్టాలని కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశించారు. గురువారం కమలానగర్, ఖాజానగర్, వేణుగోపాల్‌నగర్, సూర్యానగర్ రోడ్డు, రామ్‌నగర్ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. అధికారులతో మాట్లాడుతూ పూడికను తీయించడమే కాకుండా ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 17వ సచివాలయ పరిధిలోని తిలక్‌రోడ్డులో జరుగుతున్న చెత్త సేకరణ పనులను పరిశీలించి, రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కమిషనర్ ఆదేశించారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని పారిశుధ్య కార్యదర్శులకు సూచించారు. వారంలో ఒక రోజు డ్రైడేను పాటించి పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించేలా చూడాలన్నారు. ఫాగింగ్, స్ప్రేయింగ్ చేపట్టాలని, కాలువల్లో ఆయిల్‌బాల్స్‌ను వదలాలన్నారు. కమిషనర్ వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలి

నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలని ఈఈ సూర్యనారాయణ, ఏడీఏ లక్ష్మిప్రసన్నను కమిషనర్ ఆదేశించారు. రామ్‌నగర్ సిద్ధార్థ పార్కును కమిషనర్ పరిశీలించారు. వాకింగ్ ట్రాక్, గ్రీనరీ, లైటింగ్ తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. జిమ్ పరికరాలు పని చేస్తున్నాయా లేదా అని పరిశీలించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు పార్కులను అభివృద్ధి చేస్తామని కమిషనర్ తెలిపారు. డీఈ సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కమిషనర్ మేఘ స్వరూప్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన నగరపాలక సంస్థలోని తన చాంబర్‌లో మలేరియా, ప్రజారోగ్యాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. మలేరియా, డెంగీ, చికున్ గున్యా తదితర వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యశాఖ, నగర పాలక సంస్థ సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. మలేరియా సిబ్బందికి అవసరమైన మాస్కులు, గ్లౌజులు, బూట్లు తదితర సామగ్రి అందజేయాలని ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తికి సూచించారు. యాంటీ లార్వా ఆపరేషన్‌లో భాగంగా ఫాగింగ్, స్ప్రేయింగ్ చేపట్టాలన్నారు. విష జ్వరాలు ప్రబలిన ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ సిబ్బందికి స్ప్రేయర్, ఫాగింగ్ యంత్రాల వినియోగంపై శిక్షణ ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి, మలేరియా అసిస్టెంట్ శంకరయ్య తదితరులున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అనంతపురం కార్పొరేషన్: వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నగర పాలక సంస్థ సిబ్బందిని మేయర్ వసీం ఆదేశించారు. గురువారం 48వ డివిజన్‌లోని గౌరవగార్డెన్స్ సమీపంలో పూడికతీత పనులను మేయర్ వసీం పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫాగింగ్, స్ప్రేయింగ్, చెత్త సేకరణ కచ్చితంగా చేపట్టాలన్నారు. మేయర్ వెంట డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్ శ్రీనివాసులు, డీఈ రవీంద్ర రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మధు, రామచంద్ర, కుళ్లాయస్వామి తదితరులు పాల్గొన్నారు.

17న సామూహిక జపధ్యానం

అనంతపురం కల్చరల్: నగరంలోని రెవెన్యూ కాలనీలో ఏర్పాటైన వివేకానంద భవన్‌లో ఈనెల 17న సామూహిక రామనామ జప ధ్యానం నిర్వహిస్తున్నట్లు మెళవాయి రాజశేఖరరెడ్డి, యోగా హనుమంతరెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమయ్యే విజయ తారక మంత్రమైన శ్రీరామ జయరామ జపధ్యానంలో అందరూ పాల్గొనాలని వారు కోరారు.

నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లోని జన్మభూమినగర్, కక్కలపల్లి, కాటిగానికాల్వ, బుక్కచెర్ల, జి.కొత్తపల్లి, గాండ్లపర్తి, వరిమడుగు, పాలచెర్ల, భోగినేపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లోని భారత్ గ్యాస్ వినియోగదారులకు గురువారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఈ నెల 11వ తేదీ వరకు ఇండేన్ గ్యాస్‌ను బుక్ చేసుకున్న వారికి పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వంట గ్యాస్ సిలిండర్లను అందజేయనున్నారు. మరింత సమాచారం కోసం 08554-286777 (భారత్ గ్యాస్), 08554 246199 (హసిని ఇండేన్ పవన్ గ్యాస్), 08554 228789 (హనుమాన్ హెచ్‌పీ గ్యాస్)లో సంప్రదించవచ్చు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి 'ప్రత్యేక' ఏర్పాట్లు

అనంతపురం టౌన్: ఏ సమస్యతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు? ఎప్పుడు విద్యుత్ సరఫరా అవుతుంది? తదితర సమస్యలను వినియోగదారులు నివృత్తి చేసుకునేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్లను విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. 24 గంటలూ విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు విద్యుత్ శాఖ ఈఈ జేవీ రమేష్ తెలిపారు. నగరంలోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డిస్ట్రిబ్యూషన్ 1 సెక్షన్ :
ఫోన్ నంబర్లు: కార్యాలయ నంబర్ 7382605301, ఏఈ నంబర్ 9440813241
ఏ ప్రాంతాల వారు ఫోన్ చేయవచ్చంటే..
భవాని నగర్, అముదాల స్ట్రీట్, అంబేడ్కర్ కాలనీ, సంఘమేష్ నగర్, పాతూరు,కలెక్టర్ కార్యాలయం, అనంతసాగర కాలనీ, నీరుగంటి వీధి, బోయ స్ట్రీట్, సున్నంగేరు, సత్యమూర్తి నగర్, వీరభద్ర కాలనీ, రాణినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు వస్తే సంప్రదించాలి.

డిస్ట్రిబ్యూషన్–2
కార్యాలయ నంబర్: 73826 05302,
ఏఈ: 9440813242
ఏ ప్రాంతాల వారికంటే..
శ్రీనివాస నగర్, రామచంద్రనగర్, షిర్డీనగర్, ఎర్రనేలకొట్టాల, లెక్చరర్స్ కాలనీ, రెవెన్యూకాలనీ, ప్రకాష్‌రోడ్డు, కమలానగర్, గుల్జార్‌పేట, ఆదిమూర్తినగర్, కోర్టురోడ్డు, అరవింద్ నగర్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, బాబానగర్, పటేల్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలుంటే సంప్రదించవచ్చు.

డిస్ట్రిబ్యూషన్–3
కార్యాలయ నంబర్: 7382605303,
ఏఈ: 9440813243
కోవూర్ నగర్, శ్రీనగర్ కాలనీ, ఆర్కేనగర్, శాంతి నగర్, హెచ్‌ఎల్‌సీ కాలనీ, రామ్‌నగర్, లక్ష్మీనగర్, మొదటి రోడ్డు నుంచి ఆరవ రోడ్డు వరకు, ఆజాద్ నగర్, నడిమివంక, గౌరవగార్డెన్స్, శ్రీ శ్రీ నగర్, మారుతినగర్

డిస్ట్రిబ్యూషన్–4
కార్యాలయం: 7382605304, **ఏఈ:** 9440813244
ఏయే ప్రాంతాల వారంటే: హౌసింగ్‌బోర్డు, ఆదర్శ నగర్, నాయక్‌నగర్, సాయినగర్, విద్యుత్‌నగర్, చిన్మయనగర్, కళాకారుల కాలనీ, లెనిన్‌నగర్, రామకృష్ణకాలనీ, బుడ్డప్పనగర్

డిస్ట్రిబ్యూషన్–5
కార్యాలయం: 7382605305, **ఏఈ:** 9440813245
పరిధి: విద్యారణ్యనగర్, తపోవనం, నారాయణపురం, బళ్లారిరోడ్డు, కళ్యాణదుర్గం రోడ్డు, నందమూరి నగర్, జొన్నవీరయ్యకాలనీ, జాకీర్ కొట్టాల, సోమనాథ్‌నగర్, ప్రశాంతినగర్, స్టాలిన్‌నగర్, రాయల్‌నగర్, జనశక్తినగర్, మహదేవ్‌నగర్

డిస్ట్రిబ్యూషన్–6
కార్యాలయం: 7382605306, **ఏఈ:** 9440813246
పరిధి: గుత్తి రోడ్డు, మార్కెట్‌యార్డ్, రాజీవ్‌కాలనీ, నారాయణరెడ్డికాలనీ, గుజ్జల సరళాదేవినగర్, తారకరామకొట్టాల, హమాలికాలనీ, రిక్షాకాలనీ, వేణుగోపాల్‌నగర్, టీచర్స్ కాలనీ, భాగ్యనగర్, కల్పనాజోష్ కాలనీ, శికారికొట్టాలు, చలమారెడ్డి నగర్, విరుపాక్షకాలనీ

ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు



ఉపాధ్యాయులకు పుస్తకాలు అందిస్తున్న ఎంఈఓ నరసింహారెడ్డి

ఆత్మకూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి పాఠ్య పుస్తకాలను ఉపాధ్యాయులకు గురువారం ఎంఈఓ రామాంజనేయులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నుంచి పదవ తరగతి వరకూ 15,062 నోట్ పుస్తకాలతో పాటు, 2,736 బ్యాగులు, 1978 బెల్టులు వచ్చాయన్నారు. వాటిని పాఠశాలల వారీగా ఉపాధ్యాయులకు అందజేస్తున్నట్లు తెలిపారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

నార్పల: అప్పులబాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బి.పప్పూరులో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లికి చెందిన రైతు రాంమోహన్‌రెడ్డి (40) తనకున్న నాలుగు ఎకరాల పొలంలో వివిధ రకాల పంటలు సాగుచేస్తూ జీవనం సాగించేవాడు కుటుంబ పోషణ, వ్యవసాయానికి పెట్టుబడి కోసం రూ.30 లక్షలు దాకా అప్పులు చేశాడు. పంటల సాగులో వరుసగా నష్టాలు రావడంతో కృంగిపోయిన రైతు నాలుగు రోజుల క్రితం బి.పప్పూరు గ్రామంలోని ఓ తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం ఆ తోట యజమాని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

వినాయక నగర్‌లో చోరీ

అనంతపురం: స్థానిక వినాయకనగర్‌లో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపిన వివరాల మేరకు.. వినాయకనగర్‌లో ఉంటున్న చంద్రమోహన్‌రెడ్డి కమలానగర్‌లో ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే గురువారం ఉదయం భార్యతో కలసి షాపునకు వెళ్లిపోయారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసుకొని గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలోని 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.40 వేల నగదు ఎత్తుకెళ్లారు. సాయంత్రం వచ్చిన చంద్రమోహన్‌రెడ్డి దంపతులు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రశాంతతకు నిలయం.. వలీస్వామి ఆశ్రమం

సందర్భం
రేపు స్వామివారి ఆరాధన ఉత్సవం



వలీస్వామి



నగరంలోని వలీస్వామి ఆశ్రమం, కొలువుదీరిన దత్తపరంపర

అనంతపురం కల్చరల్: అనంతపురం నగరంలోని హెచ్చెల్సీ కాలనీలో ఉన్న వలీస్వామి ఆశ్రమం ప్రశాంతతకు నిలయంగా వర్ధిల్లుతోంది. వలీస్వామి జీవించి ఉన్న రోజుల్లో 2006లో ధర్మ ప్రచారం కోసం వచ్చిన సమయంలో అక్కల్‌కోట మహారాజ్ సేవా సమాజ్ పేరిట ఈ ఆశ్రమాన్ని నిర్మించారు. దత్త పరంపరలో భాగంగా ఆశ్రమంలో దత్తాత్రేయుడు, శ్రీపాద వల్లభుడు, నరసింహసరస్వతి, మాణిక్యప్రభు, షిరిడీ సాయినాథుని విగ్రహాలు భక్తివిశ్వాసాలను చాటుతూ చాలా మందిని ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపిస్తున్నాయి. మతసామరస్యానికి పెద్ద పీట వేసిన ఇక్కడి ఆశ్రమంలో హైందవ పర్వదినాలన్నిటితో పాటు వలీస్వామి జయంతి, వర్ధంతి ఉత్సవాలు వేలాది మంది భక్తుల సమాహారంతో ఘనంగా జరుగుతాయి. ఈ నెల 15న వలీస్వామి ఆరాధన ఉత్సవంలో భాగంగా ఉదయం నగరంలోని వలీస్వామి ఆశ్రమంలో సామూహిక భజన, అభిషేకాలు, అన్నదాన వితరణ జరుగుతుంది. అలాగే, వెంకటాపురం శ్రీసాయి కృపా నిలయం ప్రాంగణంలోని స్వామి సమాధి వద్ద గంధ పూజలు, అభిషేకాలు జరుగుతాయని ఆశ్రమ ప్రతినిధి విజయ్‌కుమార్ తెలిపారు. భక్తులు విచ్చేయాలని కోరారు.

అవధూత స్వరూపులు..

అవధూత స్వరూపులుగా భువిపై అవతరించి.. మానవమాత్రులుగా సంచరించి సమాజాన్ని విలువలపై నడిపించిన ఎందరో మహనీయులలో వలీస్వామి ఒకరు. సనాతన భారతావనిలో ఎంతో మంది సత్పురుషులు కులమతాలకతీతంగా సమాజ గతిని మార్చారు. అలా సాధారణ కుటుంబంలో జన్మించిన వలీస్వామి అచిర కాలంలోనే ఎంతో మంది భక్తులను కూడదీసుకుని వారిని సన్మార్గంలో నడిపించి అవతార పరిసమాప్తి అన్నట్టు కొద్ది సంవత్సరాలకే శివైక్యం చెందారు. కానీ స్వామివారు భక్తుల్లో ఏర్పరచిన ఆధ్యాత్మిక శక్తి, భక్తిభావం నేటికీ ఉట్టిపడుతోంది. సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తూ అనేక ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలతో వలీస్వామి ఆశ్రమం విరాజిల్లుతోంది.

సామాన్యుడిగా జననం..

వలీస్వామి సాధారణ మధ్యతరగతి ఇస్లాం కుటుంబంలో జన్మించారు. 1955లో మడకశిర మండలం కల్లుమర్రి గ్రామంలో బీబీ ఫాతిమా, వలీసాబ్ పుణ్య దంపతులకు జన్మించారు. అదేరోజు గురుదేవులు రామకృష్ణ పరమహంస జన్మదినం కూడా కావడం విశేషం. అపారమైన తెలివితేటలున్నా బాల్యమంతా ఎంతో అమాయకంగా అందరికి దూరంగా ఉన్నట్టుండే ఆయనలో ఏదో విశేషమైన ఆధ్యాత్మిక శక్తి దాగుందని చుట్టుపక్కల వారు అప్పట్లోనే గ్రహించారు. అన్ని మత గ్రంథాలలోని సారాన్ని అందరికి చెబుతూ సర్వమత సహనమే అసలైన భారతీయత అని స్వామి చాటేవారు. వలీస్వామికి వివాహమై పిల్లలు కల్గినా ఐహిక సుఖాల వెంట పడకుండా జీవిస్తూ ఎంతో మందిని ధర్మ పారాయణులుగా తీర్చిదిద్దారు. 2011లో గిరినార్ క్షేత్రంలో వననాథుల ప్రతిష్ట చేసి ధ్యానం చేస్తూనే తనువు చాలించారు. నార్పల మండలం వెంకటాపురం గ్రామంలో భక్తులు ఆయన సమాధిని నిర్మించుకుని నిత్యం ప్రత్యేక పూజలు జరిపిస్తున్నారు.

శిక్షణ కేంద్రం పరిశీలన

అనంతపురం ఎడ్యుకేషన్/బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు సమీపంలోని సమగ్ర శిక్ష ప్రాంతీయ శిక్షణ కేంద్రాన్ని ఏపీసీ వైఖోమ్ నిదియాదేవి గురువారం సందర్శించారు. శిక్షణ కేంద్రంలో కల్పించాల్సిన అదనపు సౌకర్యాలపై ఆరా తీశారు. ఎక్కడెక్కడ ఏ సౌకర్యాలు కల్పించాలనే అంశంపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. సమగ్ర శిక్ష ఈఈ శంకరయ్య, డీఈ జయరామ్, ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, సీఎంఓ గోపాల్, బుక్కరాయసముద్రం ఎంఈఓ నవీద, అలెస్కో గోవిందరెడ్డి ఉన్నారు.

హెచ్‌ఎం, ఎంఈఓపై ఆగ్రహం

బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏపీసీ నిదియాదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా మిషన్ లైఫ్ కార్యక్రమాలు, విద్యా కార్యక్రమాలపై విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులతో స్వయంగా మొక్కలు నాటించారు. అనంతరం పాఠశాలలో తరగతి గదులు, ప్రయోగశాలలను పరిశీలించారు. ఆయా తరగతుల్లో విద్యార్థులకు బెంచీలు లేకపోవడంపై పాఠశాల హెచ్‌ఎం బిల్‌కిష్‌బాను, ఎంఈఓ నవీదపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బల్లలు ఉన్నప్పటికీ పిల్లలను నేల మీద కూర్చోబెట్టడం సరికాదని మందలించారు.



ఆత్మకూరులో విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయురాలు

మోగిన బడి గంట

ఆత్మకూరు: వేసవి సెలవులు పూర్తవడంతో గురువారం మళ్లీ పాఠశాలలన్నీ తెరుచుకున్నాయి. ఎప్పటిలాగే పిల్లలు భుజాన బ్యాగులు వేసుకొని పాఠశాలలకు దారి పట్టారు. ఉపాధ్యాయులు మొదటి రోజు విద్యాభ్యాసం ఎలా ఉంటుంది? సబెక్టులకు సంబంధించి ఎలా ప్రిపేర్ కావాలి? తదితర విషయాలను తెలియజేశారు.



పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు



వడ్డుపల్లి వద్ద పచ్చగా మారిన అటవీ ప్రాంతం



ఎటు చూసినా పచ్చదనమే..



గడ్డి సమృద్ధిగా ఉండటంతో గొర్రెలు మేపుతున్న కాపరులు

భూమికీ పచ్చాని రంగేసినట్టు !

ఆత్మకూరు: వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో మండలంలో ఎటు చూసినా భూమి పచ్చగా మారిపోయింది. ఆత్మకూరు మండలం వడ్డుపల్లి సిటీ పార్కు వద్ద దాదాపు 300 హెక్టార్లకు పైగా అటవీ ప్రాంతం ఉంది. కురుస్తున్న వర్షాలతో అటవీ ప్రాంతం అంతా పచ్చగానే కనిపిస్తోంది. అటుగా వెళ్తున్న వారు రోడ్డు పక్కన వాహనాలు ఆపి మరీ ఫొటోలు దిగుతున్నారు. భూమి మొత్తం పచ్చగా మారడంతో పశువులకు ఆహారానికి ఇబ్బంది లేకుండా పోయిందని గొర్రెల కాపర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శింగనమల: శింగనమలలోని బీసీ బాలుర వసతి గృహంలో సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ మస్తాన్ సూచించారు. వసతి గృహంలో 100 సీట్లు ఉన్నాయన్నారు. మండల వ్యాప్తంగా 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పదోతరగతి ఫలితాల్లో వసతి గృహంలో చదువుకున్న వారందరూ ఉత్తీర్ణత సాధించారన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220719, 9912220732, 9912220724,
9010223702, 9010567770, 9010588846, 9912220727